ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

సోమవారం 26 ఫిబ్రవరి 2024



ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీకి కావాల్సిన వారికి తాయిలాలు ప్రకటించేందుకు టీటీడీ సిద్ధమైంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో నేటి ఉదయం 10 గంటలకు జరిగే పాలకమండలి సమావేశంలో మూడు దశాబ్దాల కిందటే గడువు ముగిసిన తట్ట లైసెన్సులను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనుకూలుర షాపులకు ఒకచోట నుంచీ మరోచోటకు తరలించేందుకు అనుమతులు లభించనున్నాయి. ఉద్యోగులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా 400మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయనున్నారు.ఇంజనీరింగ్ పనులకూ పెద్దఎత్తున అనుమతులు ఇవ్వనున్నారు.

-తిరుపతి,ఆంధ్రజ్యోతి

టీటీడీ అజెండాలో

ఎన్నికల తాయిలాలు!

నేటి పాలకమండలి సమావేశం ముందుకు పలు కీలక అంశాలు

తిరుమలలో దుకాణాలు కాకుండా రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే హాకర్లకు టీటీడీ తట్ట లైసెన్సులు జారీ చేసే విషయం తెలిసిందే.వీటికి విపరీతమైన డిమాండ్, విలువ వుండి. లైసెన్సులు తీసుకున్న వారు అనధికారికంగా ఇతరులకు రోజువారీ లేదా నెలవారీ సబ్ లీజులకు ఇచ్చి లక్షలు సంపాదిస్తుంటారు. కీలక ప్రాంతాలు, కూడళ్లలో వీటి అద్దెలు ఊహించలేని విధంగా వుంటాయి. 1987 నుంచీ 1993 మధ్య గడువు ముగిసిన సుమారు 162 తట్ట లైసెన్సులను పునరుద్ధరించే అంశాన్ని ప్రస్తుత సమావేశ అజెండాలో చేర్చినట్టు సమాచారం. ఇందులో 90 వరకూ లైసెన్సులను వైసీపీకి సంబంధించిన వారు కొనుగోలు చేశారని, వారి పేరిట తాజాగా సంబంధిత లైసెన్సులను పునరుద్ధరించేందుకు యత్నిస్తున్నారని సమాచారం. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి ఉపయోగపడే కీలక వ్యక్తులకు ఈ సాయం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. తిరుమల కొండపై తట్ట లైసెన్సులతో పోలిస్తే వందరెట్లు అధిక విలువ, డిమాండ్ దుకాణాలకు వుంటుంది. తిరుమలలో టీటీడీ నుంచీ షాపులు పొందిన వారిలో అధికశాతం యజమానులు భారీ మొత్తాల్లో అడ్వాన్సులు, అద్దెలు తీసుకుని ఇతరులకు అప్పగిస్తుంటారు. యాత్రికుల రద్దీ అధికంగా వుండే ప్రాంతాల్లోనూ, కీలక కూడళ్లలోనూ వుండే షాపుల విలువ అపారంగా వుంటుంది. అక్కడ షాపుల అడ్వాన్సులు, అద్దెలు సామాన్యుల ఊహకందవు. యాత్రికుల సందడి తక్కువగా వున్న ప్రాంతాల్లోని షాపుల యజమానులు తమ షాపులను అనువైన చోటకు తరలించుకునేందుకు ఎంత భారీ మొత్తాలైనా చెల్లించేందుకు సిద్ధపడతారు. అయితే దానికి కూడా పైస్థాయి రాజకీయ సిఫారసుతో పాటు భారీ మొత్తాలు సమర్పించుకుంటే గానీ పనులు జరగవు. నేటి పాలకమండలి సమావేశంలో 14 షాపులను ఒకచోట నుంచీ మరోచోటకు తరలించే అంశాన్ని అజెండాలో పొందుపరిచినట్టు సమాచారం. ఇవన్నీ కూడా అధికార పార్టీ ముఖ్యనేతలకు బాగా కావాల్సిన వారివని సమాచారం.

30 ఏళ్ళ క్రితం గడువు ముగిసిన తట్ట లైసెన్సుల పునరుద్ధరణ

నెలలోపే పాలకమండలి రెండో భేటీ

టీటీడీ పాలక మండలి సమావేశం చివరగా గత నెల 29వ తేదీన జరిగింది. సాధారణంగా పాలకమండలి సమావేశాలు రెండు నెలలకు ఓమారు జరుగుతాయి. అయితే నెలలోపే రెండోసారి సమావేశం ఏర్పాటు కావడంతోనే అందరి దృష్టీ సమావేశంవైపు, అజెండా వైపూ మళ్ళుతోంది. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాలు పొందే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకే ఈ సమావేశం జరుగుతోందన్న ఆరోపణలకు ఇది బలం చేకూర్చేలా వుంది. మరోవైపు ఎన్నికలయ్యాక ప్రస్తుత ప్రభుత్వం తిరిగి వస్తుందో రాదోనన్న అనుమానం వుండడం వల్లే తమ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే ఉద్దేశంతోనే నెలలోపే రెండో సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్న ప్రచారమూ జరుగుతోంది.

400 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్

టీటీడీలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 400 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేసే అంశం కూడా అజెండాలో వున్నట్టు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలో, వాటర్ వర్క్స్, ప్రెస్ పబ్లికేషన్స్ విభాగం వంటి వాటిల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఈ ఉద్యోగులకు ప్రస్తుతం 14 వేల వరకూ వేతనం అందుతోంది. వీరికి టైమ్ స్కేల్ వర్తింపజేస్తే ఏకంగా వేతనం రూ. 30 వేల వరకు పెరగనుంది.

భారీగా ఇంజనీరింగ్ పనులకు అనుమతులు

టీటీడీ ఇంజనీరింగ్ కాంట్రాక్టు పనులను ఆదాయ వనరుగా మార్చుకున్న అధికార పార్టీ ముఖ్యనేత పాలక మండలిని అడ్డుపెట్టుకుని భారీగా పనులకు అనుమతులు జారీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఇంజనీరింగ్ పనులు పెద్దఎత్తున ప్రతిపాదించి వాటికి అనుమతులు జారీ చేయడం ద్వారా పర్సంటేజీలు వసూలు చేసుకునే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎస్వీ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి

గ్రూప్-2 పరీక్షలకు 23,171మంది హాజరు

తిరుపతి(రవాణా),ఫిబ్రవరి25:తిరుపతినగరంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జిల్లాలోని 61 కేంద్రాల్లో నిర్వహించారు. అధికారులు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించారు. కొందరు వాచీలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడంతో వాటిని స్వాధీనం చేసుకుని, అక్కడ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో భద్రపరిచారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. 27,921మందికి గాను 23,171మంది (82.99 శాతం) హాజరైనట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు.

వడమాలపేటలో జడ్పీటీసీ జోరు!

అధికారులు కూడా లేకుండానే మూడు ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవం



పత్తిపుత్తూరులో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న మురళీధర రెడ్డి

వడమాలపేట, ఫిబ్రవరి 25 : నగరి నియోజకవర్గంలో వైసీపీ అసమ్మతి నేతల జోరు తగ్గడం లేదు. వడమాలపేట మండలంలో నిర్మించిన మూడు ప్రభుత్వ భవనాలను జడ్పీటీసీ సభ్యుడు మురళీధర రెడ్డి ఆదివారం ప్రారంభించేయడమే ఇందుకు నిదర్శనం.అప్పలాయగుంటలో సచివాలయం, పత్తిపుత్తూరులో రైతు భరోసా కేంద్రం, అయ్యన్నగారిపల్లిలో జగనన్న పాలవెల్లువ కేంద్ర భవనాలను జడ్పీటీసీ సభ్యుడు మురళీధర రెడ్డి ఒక్కరే ప్రారంభించేయడం చర్చనీయాంశంగా మారింది. ముందస్తు సమాచారం లేకుండా మంత్రి రోజా నియోజకవర్గ పరిధిలో అసమ్మతి నాయకుడు ఒకే పర్యాయం మూడు ప్రభుత్వ భవనాలను ప్రారంభించడం, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం. పైగా శిలా ఫలకాలు ఏర్పాటు చేసి మరీ అనుచరులతో కలిసి ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా జడ్పీటీసీ మురళీధర రెడ్డి మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన జిల్లా పరిషత్ సభ్యుడి హోదాలో తానీ ప్రారంభోత్సవాలు చేసినట్లు తెలిపారు.ఎంపీడీవో సుజాతమ్మను ఈ విషయమై వివరణ కోరగా తాను గ్రూప్- 2 పరీక్ష విధుల్లో ఉన్నానని, ప్రభుత్వ కార్యాలయ భవనాల ప్రారంభ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

కాలూరు క్రాస్‌లో

దారుణ హత్య

పట్టపగలే కత్తులతో నరికి చంపిన దుండగులు ● సోదరుడిపైనే అనుమానం

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 25: పట్టపగలే... నడిరోడ్డుపై ఓ వ్యక్తిని అటకాయించి... పారిపోతుండగా వెంటాడి కత్తులతో దారుణంగా నరికి చంపిన ఘటన తిరుపతి రూరల్ మండలంలో ఆదివారం జరిగింది.పోలీసుల కథనం మేరకు... ఎర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయితీ, పులిబోనువారిపల్లెకు చెందిన కానాల భాస్కర రెడ్డికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె సంతానం. వీరిలో రామ్మోహన్‌రెడ్డి పెద్ద కుమారుడు కాగా చంద్రశేఖరరెడ్డి (50) రెండో కుమారుడు. రామ్మోహన్‌రెడ్డి కొన్నేళ్లుగా తిరుపతిలోని మంచినీళ్లగుంట సమీపంలో నివాసం ఉంటుండగా చంద్రశేఖర్‌రెడ్డి స్వగ్రామంలోనే వుంటున్నాడు. చంద్రశేఖర రెడ్డి కుమారులు కాలూరు క్రాస్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు చంద్రశేఖర రెడ్డి స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. కొంత సమయం గడిపిన తరువాత పిల్లలు తినుబండారాలు కావాలనడంతో వాటిని తీసుకొస్తానంటూ సాయంత్రం 3గంటలకు బయటకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.పాఠశాల సమీపంలోనే మాటువేసిన ఐదుగురు వ్యక్తులు చంద్రశేఖరరెడ్డిని అటకాయించారు. ఆయన ద్విచక్రవాహనంపై ఉండగానే దాడిచేయడం ప్రారంభించారు.దీంతో పరుగెత్తి పారిపోయేందుకు ప్రయత్నించగా ఆ ఐదుగురూ వెంటాడి కత్తులతో దారుణంగా నరికి వెళ్లిపోయారు.ఈ దాడిలో చంద్రశేఖరరెడ్డి ముఖం సగానికి పైగా రెండుగా తెగిపోయింది. ఓ చేతివేలు తెగి కిందపడిపోయింది. కుడిచేయి మణికట్టువద్ద ఎముకతో సహా విరిగిపోయింది. తీవ్రరక్తస్రావంతో అల్లాడిపోతున్న చంద్రశేఖరరెడ్డిని స్థానికులే 108అంబులెన్సులో రుయాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. తిరుపతి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన భర్తను ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డే హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తంచేస్తూ మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి పాత నేరస్థుడని సమాచారం. అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై రౌడీషీట్ ఉండగా ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లోకూడా ఆయనపై కేసులున్నట్టు చెబుతున్నారు. అన్నదమ్ములిద్దరికీ కొంతకాలంగా ఆస్తి తగాదాలు నడుస్తున్నందున అన్నే మరికొందరితో కలిసి తమ్ముడిని హతమార్చి ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.రామ్మోహన్‌రెడ్డికి ఎర్రచందనం అక్రమ రవాణాలోకూడా భాగస్వామ్యం ఉందని, ఈ విషయాన్ని చంద్రశేఖరరెడ్డి బయట పెట్టినందుకే హత్యకు పాల్పడ్డారని కూడా ప్రచారం జరుగుతోంది.





మృతుడు చంద్రశేఖర రెడ్డి

పాపం.. యంత్రాంగం!

చంద్రబాబు నియోజకవర్గానికి నీళ్లిచ్చామని చెప్పుకునేందుకు సర్కారు ఆపసోపాలు

రామకుప్పం, ఫిబ్రవరి 25:టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పానికి తామే కృష్ణా జలాలను ఇచ్చామని చెప్పుకునేందుకు వైసీపీ ప్రభుత్వం చేసే ప్రయత్నాలు అధికారులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి.సోమవారం సీఎం రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువగేట్‌ను ఎత్తి జలాలను విడుదల చేయనున్నారు. ఇందుకోసం రెండు రోజుల కిందట వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్ నుంచి నీళ్లను వదిలారు. ఆ జలాలు ఆదివారం సాయంత్రానికి రాజుపేట వద్దకు చేరుతాయని అధికారులు భావించగా, శనివారం రాత్రికే చేరుకున్నాయి. జల ప్రవాహం ఎక్కువగా ఉండటంతో రాజుపేట హంద్రీ-నీవా గేట్‌కు ఎగువ ప్రాంతంలో మట్టితో వేసిన అడ్డుకట్ట తెగిపోయింది. దీంతో గేట్ పైభాగం నుంచి జలాలు గేట్‌ను దాటుకుంటూ ముందుకు ప్రవహించాయి. సీఎం గేట్‌ను ఎత్తి జలాలను విడుదల చేయకముందే ముందు కు సాగాయి. ఇక్కడ గేట్‌ను రెండు రోజుల కిందటే ఏర్పాటు చేయడంతో ఒక దశలో గేట్ కొట్టుకుపోతుందన్న ఆందోళనతో ఆదినపల్లె లిఫ్ట్ యూనిట్ వద్ద మోటార్లను ఆపు చేయించారు. సోమవారం తెల్లవారుజామున మోటార్లను ఆన్‌చేసి జలాలను రాజుపేటకుచేరేలా ప్లాన్ చేశారు.



రాజుపేట వద్ద ఆదివారం కాలువగేటు పైభాగం నుంచి ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

నేడు కుప్పానికి సీఎం రాక

రామకుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 25: ముఖ్యమంత్రి జగన్ కుప్పం నియోజకవర్గంలో సోమవారం పర్యటించనున్నారు.ఉదయం 9.45 గంటలకు సీఎం తిరుపతి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి రాజుపేటకు చేరుకుంటారు.10.30 గంటలకు హంద్రీనీవా సుజల స్రవంతి నీటిని విడుదల చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.05గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెకు చేరుకుంటారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించాక కొత్త చెరువుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.45 నుంచి మధ్యాహ్నం 1.10 వరకు బహిరంగసభలో పాల్గొంటారు.

ఆరు కిలోమీటర్లు.. రెండు హెలిప్యాడ్లు

రాజుపేట నుంచి గుండిశెట్టిపల్లె మధ్య దూరం ఆరు కిలోమీటర్లే ఉంది. అయినా అధికార యంత్రాంగం రాజుపేట, గుండిశెట్టిపల్లెలో ఒక్కోటి చొప్పున రెండు హెలిప్యాడ్లు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

టీడీపీ హయాంలోనే పూర్తయిన 80శాతం పనులు

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కారించాలన్న తలంపుతో అప్పట్లో కుప్పం మండలం పరమసముద్రం చెరువు వరకు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మార్గంలో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం మండలాల్లోని పలు పెద్దచెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపాలన్న బృహత్ ప్రణాళికతో 2016లో పనులు ప్రారంభించింది. 2019 నాటికి 80శాతం పనులు పూర్తయ్యాయి. 2019 ఎన్నికలకు ముందు హంద్రీ-నీవా జలాలు వి.కోట మండలం కృష్ణాపురం వరకు వచ్చాయి. వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాల పరిధిలో వైసీపీ నేతల ప్రోద్బలంతో కొందరు రైతులు కోర్టుకు వెళ్లడంతో అక్కడక్కడా కాలువ తవ్వకం పనులు చేపట్టలేకపోయారు. 2019 తర్వాత కోర్టు సమస్యలు పరిష్కారమయ్యాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ గద్దెనెక్కడంతో హంద్రీ-నీవా పనులు స్తంభించాయి. నాలుగేళ్ల పాలనలో మిగిలిన 20శాతం పనులు పూర్తి చేయాలన్న విషయాన్ని పట్టించుకోలేదు. 2022లో కుప్పం పర్యటనకు వచ్చిన జగన్ ఆరు నెలల్లో హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయినా పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముంచుకొస్తుండడంతో హడావిడిగా పనులు పూర్తి చేశారు.అక్కడక్కడా గుట్టలను తొలిచి కాలువ తవ్విన చోట జలాలు బండల నెర్రెల మధ్య భూమిలోకి వెళ్తున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో జలాలు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.

చంద్రబాబును కలిసిన కందాటి



చంద్రగిరి, ఫిబ్రవరి 25: టీడీపీ అధినేత చంద్రబాబును తిరుపతి మున్సిపల్ మాజీ చైర్మన్ కందాటి శంకర్‌రెడ్డి అన్న కుమారుడు కందాటి సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదివారం విజయవాడలో చంద్రబాబు నివాసంలో కందాటి సురేష్‌బాబు ఆయన్ను కలిసి, శ్రీవారి ప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. తిరుపతిలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారని తెలిపారు.

టీడీపీలో చేరిన కాంగ్రెస్ నేత



చంద్రగిరి, ఫిబ్రవరి 25: టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో తిరుపతికి చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ మాజీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మణికంఠవర్మ తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో చేరారు. విజయవాడలో అచ్చెన్నాయుడును కలిసి తన అనుచరులతో టీడీపీలో చేరారు.

ఇళ్ల స్థలాల కోసం మహిళల నిరసన



ఇళ్ల స్థలాల కోసం సర్పంచును నిలదీస్తున్న మహిళలు

భాకరాపేట, ఫిబ్రవరి 25: భాకరాపేటలో ఇళ్ల స్థలాల కోసం మహిళలు నిరసన తెలిపి సర్పంచ్ సాకిరి భూపాల్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఆరోపించారు. భాకరాపేట గ్రామ లెక్క దాఖలా సర్వే నెం.329లో తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆదివారం మహిళలు అక్కడకు చేరుకుని నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ భూపాల్ అక్కడకు వెళ్లి ఇళ్ల స్థలాలు కావాల్సిన వారు కలెక్టర్‌కుగానీ, తహసీల్దారుకుగానీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దీంతో ఆగ్రహించిన మహిళలు ప్రస్తుతం ఇస్తున్న పట్టాలన్నీ అలాగే ఇస్తున్నారా, బయట ప్రాంతాల వారికి అమ్ముకుంటున్నారా అని నిలదీశారు. దీంతో సర్పంచ్ తహసీల్దారును కలవండి అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం మహిళలు తహసీల్దారును కలవాలని నిర్ణయించుకుని తిరిగి వెళ్లిపోయారు.

400 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో నిర్వాహకులు, స్విమ్స్ డైరెక్టర్

పాకాల, ఫిబ్రవరి 27: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో దివంగతులైన మాలేపాటి నారాయణమ్మ, మాలేపాటి లక్ష్మయ్యనాయుడుల జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. స్విమ్స్ వైద్య బృందంతో పాటు డాక్టర్ రామ్మూర్తి నాయుడు, డాక్టర్ వాసు మాలేపాటి, డాక్టర్ దుర్గ, డాక్టర్ పి.మోహన 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. షుగర్, థైరాయిడ్, గుండెజబ్బులు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, స్త్రీల గర్భకోశ వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధించి పరీక్షించారు. కార్యక్రమంలో ప్రభాకర్ చౌదరి, ఎన్.సురేంద్రబాబు, ఎన్.ప్రమీలాదేవి, సూర్యకుమారి, ఎం.విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఎన్ఆర్.జయదేవనాయుడు, ఎం.వెంకటాద్రిబాబు, ఎన్.పరంధామ నాయుడు, దరియాచంద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కానిస్టేబుల్‌కు నివాళి



పాకాల, ఫిబ్రవరి 26: పాకాలలో రైల్వే కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జగదీష్ బ్రెయిన్ క్యాన్సర్‌తో మృతిచెందాడు. ఆదివారం తిరుపతి రైల్వే డీఎస్పీ షానుషేక్, రేణిగుంట రైల్వే ఇన్‌చార్జ్ సీఐ హేమసుందర్, సిబ్బంది ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. దహన క్రియల కోసం రూ.25వేలు ఆయన కుటుంబానికి అందజేశారు. ఆయన మృతిపట్ల ఆయన సహచరులు సంతాపం తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రంజిత్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 25 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా డాక్టర్ రెడ్డెప్ప ప్రజలకు సూచించారు. స్థానిక డీఆర్ మహల్ రోడ్డులో ఆయన ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లు ఎస్కే బాబు, ప్రసాద్, విశ్రాంత డీఎస్పీ పోతప్ప ప్రారంభించారు. డాక్టర్లు పవన్, రంజిత్ రోగులను పరీక్షించి అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో థైరోకేర్ గిరి, ఎస్‌జీఎస్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు బండి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా బండారు పార్థసారధి



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 25: యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతికి చెందిన బండారు పార్థసారధి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ నియామక పత్రం విడుదల చేశారు. పార్థసారథి మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ తిరుపతిలో పార్టీ బలోపేతానికి తనవంతు శ్రమిస్తానన్నారు.

ప్రకటనల టవర్ కోసం చెట్ల నరికివేత





తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25 : ఎంతో కాలంగా పచ్చగా పెరిగిన చెట్లను నరికివేసి యాడ్స్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వెనుకవైపున కొంత ఖాళీ స్థలం ఉంది. అనేక కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈ స్థలంలో ఉంచారు. అలాగే అండర్ బ్రిడ్జికి సరిహద్దుగా ఉన్న ఈ స్థలంలో రెయిలింగ్ పొడవునా నాటిన కానుగ చెట్లు ఏపుగా పెరిగి మంచి నీడనిస్తున్నాయి. అయితే కాస్త ఆదాయం సమకూర్చుకునేందుకు ఈ స్థలంలో ప్రకటనల టవర్ ఏర్పాటు చేసేందుకు గత ఎస్పీ పరమేశ్వరరెడ్డి అనుమతినిచ్చారు. ఆ మేరకు ప్రస్తుతం ఈస్ట్ పోలీస్ స్టేషన్ వెనుక ప్రాంతంలో ఇనుప యాడ్స్ టవర్ నిర్మాణం జరుగుతోంది. ఇందుకు రెయిలింగ్ పొడవున ఉన్న కొన్ని చెట్లను నరికివేశారు.

సమయం లేదు.. చక్కబెట్టేద్దాం!

ఎన్నికలు సమీపిస్తున్న వేళ పేట్రేగిపోతున్న కబ్జాదారులు - ఎన్ఆర్ఐల స్థలాలపై కన్ను - వాట్సప్ వీడియోల ద్వారా బాధితుల ఆవేదన

తిరుపతి- ఆంధ్రజ్యోతి

రెండు, మూడు వారాల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం కనిపిస్తుండడంతో దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్టు వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, వారి అనుచరులు తిరుపతిలో ఖాళీ స్థలాలను కబ్జా చేయడం వేగవంతం చేశారు. ముఖ్యంగా విదేశాల్లో స్థిరపడిన వారి స్థలాలను టార్గెట్‌గా చేసుకుని నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడుతున్నారు. వైసీపీ నేతల అండదండలతో కంచి రాము అనే వ్యక్తి తమ స్థలాన్ని కబ్జాచేశారని ఆరోపిస్తూ ఆస్ట్రేలియాలో స్థిరపడిన తిరుపతికి చెందిన డాక్టర్ సునీత విడుదల చేసిన వీడియో సోషల్ మీడియలో వైరల్ అయిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఎన్ఆర్ఐ స్థలంపై భూబకాసురులు వాలిపోయారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో బైపాస్ రోడ్డుకు సమీపంలోని దాదాపు రూ.10కోట్ల విలువైన స్థలంపై కబ్జారాయుళ్ల కన్నుపడింది. దీంతో తమకు న్యాయం చేయాలంటూ తిరుపతి ఎస్పీ మలిక గార్గ్‌కు వాట్సప్ వీడియో ద్వారా అమెరికా నుంచి స్థలయజమాని కొణిదల రాజేశ్వరి కన్నీటిపర్యంతమయ్యారు.

● రూ.10కోట్ల స్థలంపై కన్ను



తిరుచానూరు గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు.303లో 4.80ఎకరాల భూమికి రుద్రరాజు దుష్యంత్ రాజుకు రైత్వారీ పట్టా (ఎస్ఆర్ నెం.29/86 ఐడీటీ నెం 1/8సీటీఆర్)ను 1986 జనవరి 1న మంజూరు చేశారు. సదరు భూమిని కొంతకొంతగా విభజించి పలు దఫాలుగా పలువురికి విక్రయించారు.ఈ క్రమంలో తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన నల్లాని మునస్వామి నాయుడు నుంచి కొణిదల రాజేశ్వరి, ఆమె కుమార్తె వినీల 2003లో 65 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో చిన్న గదులు నిర్మించి, బోరు వేశారు. కరెంటు కనెక్షన్ తీసుకున్నారు. కొంతకాలం ఇటుకలు తయారు చేసేవారికి అద్దెకు ఇచ్చారు. ఆ తర్వాత చిన్న చిన్న పనులు చేసుకునేవారు ఉండేవారు. స్థలం పల్లపు ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలంలో నీరుచేరి దోమలకు ఆవాసంగా మారింది. దీంతో పక్కింటివారు నీళ్లలేకుండా చూడాలని కోరడంతో, దాదాపు రూ.15లక్షలు వెచ్చించి ఇటీవలే మట్టిని తోలించారు.కొణిదల రాజేశ్వరి, చంద్రశేఖర్ దంపతులకు పిల్లలు వినీల, జాహ్నవి అమెరికాలో స్థిరపడ్డారు. మట్టిని చదును చేస్తుండడం గమనించిన కబ్జాదారులు రాత్రికిరాత్రి అక్కడున్న చిన్నగదులను కూల్చేశారు. రాజేశ్వరి జనవరిలో కుమార్తెలను చూడ్డానికి అమెరికా వెళ్లారు. దీంతో ఆ సమాచారం అందుకున్న ఆమె సమీప బంధువు విష్ణు నాయుడు స్థలంవద్దకు చేరుకుని ఆరా తీశారు. స్థానిక వైసీపీ సర్పంచ్ అనుచరుడు రెడ్డీశ్వర్ రెడ్డి 4.80 ఎకరాల స్థలం తాను దుష్యంత్ రాజు దగ్గర అగ్రిమెంటు చేసుకున్నానని, అందువల్ల స్థలం తనకే చెందుతుందని చెప్పడంతో విష్ణు ఖంగుతిన్నారు. సమాచారాన్ని అమెరికాలో ఉన్న రాజేశ్వరికి వివరించారు. దీంతో ఆమె కన్నీటిపర్యంతమవుతూ న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీకి వీడియో సందేశాన్ని పంపారు. దాదాపు రూ.10కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

● కంచె వేసి కబ్జా



తిరుపతిలోని కైకాలచెరువు గ్రామ లెక్కదాఖలా సర్వే నెం. 1లో 240 అంకణాల స్థలం ఉంది. 2022లో ఆ స్థలం సబ్ డివిజన్ చేసినట్టు చెప్పి వైసీపీ నేతల అండదండలతో బాలాజీ టింబర్ డిపో అధినేత కంచి రాము ఆక్రమించారంటూ ఆస్ట్రేలియాలో స్థిరపడిన డాక్టర్ సునీత దంపతులు తిరుపతి జేసీ కోర్టును ఆశ్రయించారు. పలు వాయిదాల అనంతరం ఆ స్థలం డాక్టర్ సునీతదేనని అప్పటి జాయింట్ కలెక్టర్ బాలాజీ తేల్చారు. అయినా కబ్జా ఆగలేదని కంచి రాము కోర్టులో తప్పుడు పత్రాలు సమర్పించి తప్పుదోవ పట్టించారని ఆమె ఆవేదన చెందుతున్నారు. ఆస్ట్రేలియా నుంచి 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి సహకారంతోనే తిరుపతిలో కబ్జా పర్వం సాగుతోందని ఆరోపించారు. హైకోర్టులో వివాదంలో ఉన్న భూమికి తమ అనుమతి లేకుండానే సబ్ డివిజన్ చేసి, దాదాపు రూ.61 కోట్ల టీడీఆర్ బాండ్లు ఎలా ఇస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు కబ్జాదారుడికి కొమ్ముకాశారని విమర్శించారు. 60 అంకణాల విస్తీర్ణం కలిగిన 7 ప్లాట్లు కబ్జా చేశారంటూ తన ఆవేదనను వెల్లగక్కుతూ ఇటీవల ఆస్ట్రేలియా నుంచి ఆమె విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. దీంతో సదరు స్థలంలో చకచక పనులు మొదలుపెట్టారు. చుట్టూ ప్రహరీ నిర్మించి నిర్మాణాలు చేపడుతున్నారు. న్యాయస్థానం తనకు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్‌తో పాటు ఇంటీరియం ఉత్తర్వు వచ్చిందని, ఆమె ఆరోపిస్తున్నట్టుగా తాను ఎలాంటి కబ్జాలు చేయలేదని కంచి రాము వీడియో ద్వారా చెప్పుకున్నారు.

రుయాలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

● వర్చువల్‌గా చేసిన పీఎం నరేంద్ర మోదీ



వర్చువల్లో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



శిలా ఫలకం ఆవిష్కరణలో అధికారులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 25 : ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద దేశంలోని పలు క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ)లకు గుజరాత్ రాజకోట్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల అనుబంధ రుయా స్పత్రి ఆవరణలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన శిలా ఫలకం ఆవిష్కరించారు. ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం వీక్షించే ఏర్పాటు చేశారు. పీఎం మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కేర్ ప్రాజెక్ట్ కింద దేశంలోని ఐదు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్ కళాశాలలను జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. 200కు పైగా హెల్త్ క్రిటికల్ కేర్ బ్లాక్‌లను ప్రారంభించడం, శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి పెద్దపీట వేశాయన్నారు. ఎంపీ మద్దిల గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, టీబీ నియంత్రణాధికారి అరుణ సులోచనదేవి, డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధం

● మొదటి అంతస్తులోని సరుకూ బుగ్గిపాలు

● మిద్దె నుంచి పక్క భవనంపైకి చేరుకుని ప్రాణాలు దక్కించుకున్న గృహస్తులు

● రెండు గంటలపాటు కష్టపడి మంటలను అదుపుచేసిన ఫైర్ సిబ్బంది ● రూ.కోటి మేర నష్టం





తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రేగిన మంటలతో నగరంలో రెండంతస్తుల చెప్పుల దుకాణం పూర్తిగా కాలిపోయింది. తిరుపతి జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతికి చెందిన బద్రీనాథ్ వీవీ మహల్ రోడ్డులో నోవా కలెక్షన్స్ పేరిట ఓ చెప్పుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో చెప్పుల దుకాణం, మొదటి అంతస్తులో గోడౌన్, రెండో అంతస్తులో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. మూడో అంతస్తులో చిన్న గది ఉంది. ఆదివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణం నుంచి పెద్దఎత్తున పొగలు వ్యాపించాయి. రెండో అంతస్తులోని యజమానులు కిందకు దిగి చూసేందుకు ప్రయత్నించగా దట్టంగా పొగలు వ్యాపించడంతో ప్రమాదాన్ని గ్రహించారు. తక్షణం కుటుంబ సభ్యులందరూ మిద్దెమీదకు చేరుకుని పక్క భవనాలపై నుంచి వెనుక ప్రాంతంలోని మరో భవనంపైకి చేరుకుని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈలోపు మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణంతోపాటు మొదటి అంతస్తులోని గోడౌన్‌లోని సరుకు కాలిపోయింది. రెండో అంతస్తులోకి పొగలు వ్యాపించి గృహోపకరణాలన్నీ నల్లగా మాడిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు తిరుపతి జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు అగ్నిమాపక శకటాలతో సుమారు రెండు గంటలకు పైగా పోరాడి మంటలను అదుపుచేశారు. మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా నిరోధించారు. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సాయం అందించారు. ఈ ప్రమాదం వల్ల కోటి రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపకాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరి జల్లికట్టులో విషాదం

నిర్వహణా వైఫల్యం, పశువుల యజమానుల అత్యుత్సాహమే కారణం







ఎద్దును నిలువరించలేక కిందపడ్డ యువకుడు -ఎద్దు ఢీ కొనడంతో అపస్మారక స్థితిలో వెంకటముని - గాయపడ్డ యువకుడు

చంద్రగిరి, ఫిబ్రవరి 25 : చంద్రగిరిలో మొదటిసారిగా ఆదివారం నిర్వహించిన జల్లికట్టు వేడుకలు చివరకు విషాదంగా ముగిశాయి. పశువుల యజమానులను నిర్వాహకులు నియంత్రించలేకపోవడం, దారీతెన్నూ తెలియక పశువులు ఇష్టారాజ్యంగా పరుగులు తీయడంతో ఒకరు చనిపోగా పలువురికి గాయాలయ్యాయి.పశువుల యజమానులు పబ్లిసిటీ కోసం తమ ఎద్దులను వాహనాల్లో తీసుకొచ్చి చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి బాణాసంచా కాల్చుతూ, డప్పులు వాయిస్తూ అనుచరులతో నినాదాలు చేస్తూ జల్లికట్టు నిర్వహించే ప్రదేశానికి చేరుకున్నారు. జల్లికట్టు నిర్వహణ అన్ని గ్రామాల్లో మధ్యాహ్నంలోగా ప్రారంభమవుతుంది. చంద్రగిరిలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది.అప్పటికే జల్లికట్టు తిలకించడానికి వచ్చిన వేలాదిమంది యువత, ప్రజలు ఎండ తీవ్రతకు ఇబ్బందిపడ్డారు.జల్లికట్టు ప్రారంభానికి ముందే దూర ప్రాంతాల నుంచి వచ్చే ఎద్దులు, పశువులు చేరుకొంటాయి. నిర్వాహకుల వైఫల్యం కారణంగా చంద్రగిరిలో మాత్రం జల్లికట్టు ప్రారంభమైన తరువాత పశువులు పరుగెత్తుతుండగా, వీటికి అడ్డంగా ఎదురుగా ఒక్కొక్కరు వాహనాల్లో పశువులను తీసుకుని ఎదురుగా రావడంతో పరుగెత్తే పశువులు కంగారు పడి జనాలపైకి దూసుకెళ్లాయి. దీంతో పలువురు గాయపడ్డారు. వెదురుకుప్పం మండలం, పచ్చికాపల్లం గ్రామం నుంచి తోలుకొచ్చిన ఎద్దు చంద్రగిరి బజారువీధిలోని లైబ్రరీ వద్దకు రాగానే రోడ్డు పైన రాకపోకలు సాగిస్తున్న వాహనాలను చూసి కంగారుపడి పరుగులు తీసింది. రోడ్డు పక్కనున్న ద్విచక్ర వాహనాలను, తోపుడు ఐరన్ బండిని కిందపడేసింది. సుమారు అర్ధ గంట పాటు ఎద్దు చుట్టు పక్కల వారిని భయభ్రాంతులకు గురిచేసింది.

గొల్లపల్లెలో ఉత్కంఠభరితంగా జల్లికట్టు



రామచంద్రాపురం, ఫిబ్రవరి 25 :రామచంద్రాపురం మండలం నీకేపల్లి పంచాయతీ గొల్లపల్లె గ్రామంలో ఆదివారం జల్లికట్టు ఉత్కంఠ భరితంగా సాగింది. ఎన్నికలు సమీపిస్తుండటంతో వివిధ రాజకీయ పార్టీల మద్దతుదారులు తమ నాయకుల ఫొటోలతో పాటు విలువైన బహుమతులను కోడెగిత్తల కొమ్ములకు కట్టి అల్లివద్దకు తీసుకువచ్చారు. వాటి వెనుక డప్పులు మోగించి బెదిరించడంతో అవి వీధుల్లోకి పరుగులు తీశాయి. యువకులు జట్లుగా ఏర్పడి వాటిని నిలువరించే క్రమంలో కింద పడి గాయాలపాలయ్యారు. జల్లికట్టును తిలకించేందుకు వెదురుకుప్పం, చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల నుంచి భారీగా జనాలు తరలివచ్చారు. గ్రామస్తులు ప్రజలకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

ఫిల్మ్‌ఛాంబర్ జిల్లా కోఆర్డినేటర్ల నియామకం



ఏపీ ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 25: తిరుపతిలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ చామర్స్ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సమావేశం నిర్వహించారు.ప్రముఖ సినీ నిర్మాత, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ఏఎం రత్నం అధ్యక్షత వహించారు. ఫిల్మ్‌ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జె.వి.మోహన్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన నిర్మాతలు ఇక్కడే చిత్రీకరణలు చేయాలని, ఇందుకు ఛాంబర్ కూడా సహకరిస్తుందన్నారు.ఏపీ ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కోఆర్డినేటర్లుగా ఎ.వి.రవిచంద్రారెడ్డి(తిరుపతి), జెమిని కాంత్(చిత్తూరు), నక్కా రాజేంద్రప్రసాద్ (అన్నమయ్య)నియమితులయ్యారు. ఛాంబర్ ప్రతినిధులు పి.విజయవర్మ, మంతా శ్రీనివాస్, ఎన్.ఎస్.మూర్తి, పి.రమణారెడ్డి, ప్రసాదరెడ్డి, రవీంద్రగోపాల్, వింజమూరి మధు, ఈశ్వర్‌రావు, నెల్లూరు కోఆర్డినేటర్ కళాంజలి అనంత్, సెన్సార్ బోర్డు మెంబర్ మారం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైర్ తెగిపోయి కిందపడిన లిఫ్ట్

పశ్చిమబెంగాల్ యువ కార్మికుడి దుర్మరణం



మృతిచెందిన అజిత్

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 25: నిర్మాణంలో ఉన్న ఓ భవనం ఏడో అంతస్తులో లిఫ్ట్ వైరు తెగిపోయి లిఫ్ట్ కిందపడిపోయింది. ఆ సమయంలో లిఫ్ట్‌లో ఉన్న పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన తిరుపతి రూరల్ ప్రాంతంలో ఆదివారం జరిగింది. చెర్లోపల్లి - జూపార్క్ రోడ్డులో భారత్ పెట్రోల్ బంకు పక్కన టెంపుల్ ట్రీ అపార్ట్‌మెంట్ పేరున ఏడంతస్తుల భవన నిర్మాణం సాగుతోంది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన అజిత్ (24) ఈ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. లిఫ్ట్‌లో ఏడో అంతస్తుకు మెటీరియల్ తీసుకెళ్తుండగా లిఫ్ట్ వైర్ తెగిపోవడంతో అక్కడినుంచి లిఫ్ట్‌తో పాటు అజిత్ కిందపడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు వచ్చి ఫిర్యాదు చేశాక కేసు నమోదు చేయనున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

వేడుకగా కోదండరాముడి పేటోత్సవం





పల్లకిలో కూపుచంద్రపేటకు చేరుకున్న కోదండరామస్వామి - అన్నదానం చేస్తున్న సైకం జయచంద్రారెడ్డి దంపతులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 25: కోదండరామస్వామి వారి పేటోత్సవం అత్యంత వేడుకగా సాగింది. తిరుపతిలోని కోదండరామస్వామి వారి ఆలయం నుంచి పల్లకిపై తిరుపతి రూరల్ కూపుచంద్రపేట గ్రామానికి కోదండరాముడు చేరుకున్నారు. తిరుపతి నుంచీ కేసీ పేట దాకా సాగిన ఈ ఊరేగింపులో ఆయా గ్రామాల వద్ద పెద్ద సంఖ్యలో స్వామి వారిని భక్తుల దర్శించుకున్నారు. మాఘ పౌర్ణమి మరుసటి రోజున ఏటా సాగే ఈ కార్యక్రమాన్ని కేసీ పేటలో నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కోదండరాముడి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కేసీపేటకు తీసుకు వచ్చారు. అక్కడ సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి ఉత్సవ మూర్తులను మళ్లీ ఊరేగింపుగా కోదండరామ ఆలయానికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో నాగరత్న, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కర్రసాము విన్యాసాలు



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 25: కర్రసాము మన ప్రాచీన యుద్ధ కళ అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. తిరుపతి రూరల్ తుమ్మలగుంట మైదానంలో కర్రసాము పోటీలు నిర్వహించారు. ఆది దేవ ఫౌండేషన్ చేపట్టిన ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు, యువత కర్రసాము పోటీల్లో పాల్గొన్నారు. వారు చేసిన కర్రసాము విన్యాసాలు ఆహూతులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా న్యూఢిల్లీకి చెందిన బేస్ పవర్ గ్రీన్ ఎనర్జీ చైర్మెన్ ఏఎస్ రెడ్డి, డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ మెంబర్ (డీఆర్‌యూసీసీ) సభ్యులు గుండ్లూరు వెంకటరమణ, తదితరులు మాట్లాడారు. కర్రసాము కళను కాపాడుకోవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కర్రసాముతో పాటు కత్తిసాము, గదాయుద్ధం, ధనుర్ విద్య వంటి ప్రాచీన కళలను కాపాడుకోవాలని కోరారు. ఈ కర్రసాము పోటీల నిర్వహణకు తోడ్పడిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏఎస్ రెడ్డి, గుండ్లూరు వెంకటరమణ తదితరులు క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిదేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సి. ఆదినారాయణ, శిలంబరం వరల్డ్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిస్టోఫర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డి.అశోక్‌బాబు, కార్యదర్శి పి. ఇంద్రముని, డాక్టర్ సి. కుప్పయ్య, ఎంఎస్ఆర్ స్కూల్ అధినేత డాక్టర్ ఎంఎస్ రాజు, మునిరాజు, ప్రసాద్, అఖిల్, సతీష్, సదాశివ, తదితరులు పాల్గొన్నారు.

అబ్బురం... నృత్యం



తిరుచానూరు, ఫిబ్రవరి 25: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం కళాకారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు అబ్బురపరిచాయి. పలు అన్నమయ్య కీర్తనలకు భరతనాట్యంలో గురువు రంజని ఉమేష్ ఆధ్వర్యంలో శ్రీనిధి భరద్వాజ్, దిశ, లావణ్య, అక్షయ్య ప్రదర్శన చేశారు.

తిరుపతి

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



జస్టిస్ శ్రీసుధ - జస్టిస్ సెంథిల్ కుమార్

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలో మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.సెంథిల్‌కుమార్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ముంబైలో వేడుకగా శ్రీవారి కల్యాణం

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ముంబై మహానగరంలోని తూర్పు దోంబివలి ప్రాంతంలో ఆదివారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం వేడుకగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహించారు. సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ టీటీడీ నిర్వహిస్తున్న సనాతన హిందూ ధర్మప్రచారాన్ని అభినందించారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ పెద్ద ఎత్తున ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కల్యాణోత్సవంలో చైర్మన్, ఈవోతో పాటు ఎంపీ శ్రీకాంత్ షిండే, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు అన్నమయ్య కీర్తనలను మధురంగా ఆలపించారు.

షర్మిల బహిరంగ సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 25: తిరుపతిలో మార్చి ఒకటో తేదీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొననున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ కోరారు. గాంధీభవన్‌లో ఆయన ఆదివారం పార్టీ నాయకులతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు పంట శ్రీనివాసులురెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, తిరుపతి నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, పీసీసీ ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, నాయకులు చంద్రశేఖర్, రవి, అబ్దుల్‌మజీద్ పటేల్, తేజవతి, నారాయణ, శోభ, శాంతియాదవ్, పరదేశి, షేక్ జావేద్, వెంకటేష్‌గౌడ్, మున్వీర్, సమీవుల్లా, రమేష్‌రెడ్డి, మహేష్‌రాయల్, వేణుగోపాల్, భాస్కర్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

కారుపై రాజకీయ స్టిక్కర్‌తో తిరుమలకు..



అధికారపార్టీ జెండా, నాయకుడి ఫొటోతో ఆలయం ముందు కారు

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు తిరుమలకు వచ్చిన ఘటన మరువకముందే మళ్లీ ఆ తరహా అతిక్రమణే చోటుచేసుకుంది. అధికార పార్టీ జెండాలోని రంగులతో కూడిన స్టిక్కర్‌తో ఉన్న కారు ఆదివారం తిరుమలకు వచ్చి విమర్శలకు దారితీసింది. ఆ జెండాపై రాజకీయనేత ఫొటో కూడా ఉండటం గమనార్హం. టీటీడీ బోర్డు సభ్యుడికి చెందిన కారుగా తెలిసింది. రాజకీయ పార్టీల జెండాలు, గుర్తులు, వ్యక్తులతో కూడిన స్టిక్కర్లతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరిలోనే గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. అయితే అధికార పార్టీకి చెందిన వ్యక్తుల వాహనాలు కావడంతో భద్రతా సిబ్బంది చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే తరుచూ అధికార పార్టీకి చెందిన జెండాలు, కండువాలు, స్టిక్కర్లతో వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి.

సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



ప్రజలకు చికిత్స చేస్తున్న వైద్యులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 25: రైల్వేకాలనీలోని సరస్వతి శిశు మందిర్‌లో సేవా భారతి స్వచ్ఛంద సంస్థ, కేసువ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సిద్ధ ఆయుర్వేద యోగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన సిద్ధ ఆయుర్వేద వైద్యుల నేతృత్వంలో నగర ప్రజలకు ఆరోగ్య సమస్యలకు సంబంధించి సిద్ధ వైద్యాన్ని అందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు నెలలపాటు ప్రతినెలా చివరి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. సేవాభారతి సభ్యులు కీర్తి వెంకయ్య, చంద్రారెడ్డి, హేమంత్‌కుమార్, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలపై రేపు గ్రీవెన్స్ డే

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 25 : వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఉద్యోగులు వారి సమస్యలపై అర్జీలను అందించవచ్చని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌కు 'డాగ్‌షో' అవార్డు



సాయికుమార్

తిరుపతి(కొర్లగుంట), మార్చి 24: 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీలలో ఆంధ్రజ్యోతి తిరుమల స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సాయికుమార్‌కు 'డాగ్‌షో' అవార్డు లభించింది. ఈ మేరకు ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి తమ్మ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా పోటీపడిన 25మంది ఫొటోగ్రాఫర్‌లలో తిరుపతికి చెందిన యువకుడికి జాతీయస్థాయి అవార్డు వరించడం పట్ల పలువురు పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో సాయికుమార్ ఈ అవార్డును విజయవాడలో స్వీకరించనున్నారు.



ప్రెస్‌క్లబ్ డైరీ ఆవిష్కరణ

తిరుపతి ప్రెస్‌క్లబ్ 2024 డైరీని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మేయర్ డాక్టర్ శిరీష, ఎంపీ గురుమూర్తితో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ సభ్యులకు డైరీలను అందజేశారు.

- తిరుపతి(తిలక్‌రోడ్)

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 72,175 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 29,543 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



హర్షవర్ధన్ రామేశ్వర్

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

సామూహిక సంధ్యావందనం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 25 : స్థానిక వైకుంఠపురం శ్రీనగర్ కాలనీలోని ఓంశక్తి ఆలయంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన కేసీ దాస్ మెమోరియల్ ట్రస్టు తిరుపతి శాఖ సభ్యులు సామూహిక సంధ్యావందనం నిర్వహించారు. తిరుపతి శాఖ కోఆర్డినేటర్ ఖండవిల్లి రాధాకృష్ణ నేతృత్వంలో జపతులు ఉదయం 6నుంచి 9గంటల వరకు గాయత్రి మంత్రజపం, సామూహిక సంధ్యావందనం కావించారు.

నేడు అవధాన కల్యాణం పుస్తకావిష్కరణ

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 25: ఆస్ట్రేలియాలో ఉంటూ అక్కడ తెలుగు విద్యావ్యాప్తికి కృషి చేస్తున్న అవధానార్చన భారతి తటవర్తి కల్యాణ్ చక్రవర్తి రచించిన అవధాన కల్యాణం పుస్తకావిష్కరణ సభ సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షత జరిగే ఈ కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. డాక్టర్ మాలేపట్టు పురుషోత్తమాచారి సమీక్ష చేస్తారు. రచయిత తన స్పందన తెలియజేస్తారు. ఇటీవల శతావధానం పూర్తిచేసిన యువ అవధాని భరత్ శర్మను విశ్వశ్రీ సాహితీ సమాఖ్య తరఫున సత్కరించనున్నారు.

కపిలతీర్థంలో కోయిల్ అళ్వార్ తిరుమంజనం



ఆలయ శుద్ధిలో అధికారులు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 25: కపిలేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. మార్చి ఒకటో తేదీ నుంచి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ శుద్ధి కార్యక్రమం చేపట్టారు. 29వ తేదీ అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. తిరుమంజనంలో భాగంగా ఉదయం సుప్రభాతం అనంతరం అభిషేకం నిర్వహించారు. 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలు, ఆవరణను శుద్ధీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని యువత కోరుకుంటోంది

తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు



టీడీపీకి ఓటు వేయాలని ప్లకార్డు చూపుతున్న రవినాయుడు, తెలుగు యువత నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 25: రాష్ట్రంలో యువత టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అధికారంలోకి రావడం తథ్యమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు అభిప్రాయపడ్డారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని విద్యార్థులు, యువతలోకి తీసుకెళుతున్నామని, వారి నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. గతంలో చేసిన తప్పు మళ్లీ చేయమని, మొదటి ఓటు చంద్రబాబుకు వేస్తామని యువత ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, స్కాలర్‌షిప్ లేక బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు మార్కు ఎక్కడ అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడగడం హాస్యాస్పదంగా ఉందని, ఉమ్మడి రాష్ట్రంలో అయినా.. నవ్యాంధ్రలో అయిన బాబు మార్కు స్పష్టంగా ఉందని వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావడానికి చంద్రబాబు కారణమన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఆయన వల్లే సాధ్యమైందన్నారు. తిరుపతి ఫ్లైఓవర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు భావిస్తే కమీషన్ల కోసం వైసీపీ నాయకులు భ్రష్టు పట్టించారని విమర్శించారు. సీఎం జగన్‌ను ఇంటికి పంపడానికి జనం సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మహేష్‌యాదవ్, హేమంత్‌రాయల్, వాసు, కరణం సందీప్, వెంకటేష్‌యాదవ్, శ్రీరామ్ బాబీ, సంతోష్, డిల్లీరాయల్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆలోచనలు మన తరానికి మార్గదర్శకాలు

- **సుదీర్ఘ స్వప్నం పుస్తకావిష్కరణ సభలో ఎస్వీయూ వీసీ**



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి, రచయిత నాగసూరి, సాకం నాగరాజ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 25: దేశాన్ని అహింసా విధానం ద్వారా కదిలించి సఫలీకృతమైన మహాత్మాగాంధీ మార్గంలో మన తరం ముందుకు వెళ్లాలని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మూరిశెట్టి గోవిందు రాసిన సుదీర్ఘ స్వప్నం నవల ఆవిష్కరణ కార్యక్రమం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) చేపట్టిన ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని వీసీ శ్రీకాంత్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. గాంధీ మార్గం ప్రపంచానికే ఆచరణీయమైందిగా నిలిచిందన్నారు. ఇంతటి విశిష్టత గల మహాత్మా గాంధీ జీవిత గాథను ఈ తరం తెలుసుకోవాలన్నారు. తద్వారా అహింస, సత్యం, ధర్మ మార్గాల్లో పయనించాలని కోరారు. టీటీడీ మ్యూజియం డైరెక్టర్ నాగోలు కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేటి రాజకీయాల ప్రక్షాళనకు గాంధీజీ సిద్ధాంతం దారి దీపంగా ఉపకరిస్తుందన్నారు. ప్రముఖ రచయిత నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ ఎందరు రాసినా, మాట్లాడినా తరగని మహోన్నత వ్యక్తిత్వం మహాత్మాగాంధీ సొంతమన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వేంకటేశ్వర్లు పుస్తక సమీక్ష చేస్తూ ప్రస్తుతం కులం రాజకీయ వ్యవస్థను శాసిస్తోందన్నారు. గాంధీజీ ఆలోచనలను విస్మరించడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు. గాంధీ ఆలోచనలను ఆచరించడం ద్వారా కుల ప్రభావాన్ని కొంత దూరం చేయొచ్చని సూచించారు. అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు సాకం నాగరాజ మాట్లాడుతూ మన రాష్ట్రంలోనూ విస్తృతంగా పర్యటించిన గాంధీజీ, సాహిత్యంలోనూ ప్రతిబింబిస్తున్నారని చెప్పారు. మూరిశెట్టి గోవిందు రాసిన సుదీర్ఘ స్వప్నం నవల కూడా ఇందుకు ఒక ఆనవాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, సాహితీవేత్తలు ఆముదాల మురళి, ఆర్సీ కృష్ణస్వామిరాజు, పేరూరు బాలసుబ్రమణ్యం, తమటం రామచంద్రారెడ్డి, టెంకాయల దామోదరం, కలువగుంట రామ్మూర్తి, మల్లేశ్వరరావు, చిత్రకారులు ఈసలాపురం బాలసుబ్రమణ్యం, కవి వళ్లవార్ షణ్ముగం పాల్గొన్నారు.

కల్యాణకట్ట కార్మికుల నుంచి రూ.80 లక్షల వసూలు

- **విజిలెన్స్ విచారణ చేయిస్తామన్న బోర్డు సభ్యుడు**



సమావేశంలో మాట్లాడుతున్న యానాదయ్య

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 25 : టీటీడీలో పనిచేస్తున్న 850 మంది నాయీ బ్రాహ్మణులను కొంతమంది తప్పుదారి పట్టించి రూ.80లక్షలు వసూలు చేశారని, దీనిపై విజిలెన్స్ విచారణ చేయిస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జీవో 110 ప్రకారం దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో వంద రోజులుగా పనిచేస్తున్న కల్యాణకట్ట కార్మికులకు రూ.20వేలు వేతనం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇదే అంశాన్ని టీటీడీలోని కల్యాణకట్ట కార్మికులకూ వర్తింపజేయాలని చూస్తే సీఐటీయూ నేత కందారపు మురళి, మరికొందరు వారిని తప్పుదారి పట్టించారని ఆరోపించారు. వారి నుంచి డబ్బు వసూలు చేయడమేగాక కోర్టుకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. చెప్పుడు మాటలు వినకుండా కార్మికులు ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం కార్పొరేషన్ కింద చేరాలని కోరారు. ఇదేమీ బలవంతం కాదని, ఇష్టప్రకారమే నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బ్రెయిన్ క్యాన్సర్‌తో రైల్వే కానిస్టేబుల్ మృతి

- **కుటుంబ సభ్యులకు రూ.25వేలు అందించిన రైల్వే పోలీసులు**



జగదీష్ (ఫైల్‌ఫొటో)



జగదీష్ సతీమణి భార్గవికి ఆర్థికసాయం అందజేస్తున్న రైల్వే డీఎస్పీ షాను షేక్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 25: పాకాల రైల్వే పోలీసు ఔట్‌పోస్టులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జగదీష్ (41) బ్రెయిన్ క్యాన్సర్‌తో శనివారం సాయంత్రం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భౌతికకాయాన్ని స్వగ్రామమైన రామచంద్రాపురం మండలం నత్తకుప్పం గ్రామానికి తరలించారు. ఆదివారం రైల్వే డీఎస్పీ షాను షేక్, రేణిగుంట రైల్వే ఇన్‌చార్జి సీఐ హేమసుందర్ నత్తకుప్పం గ్రామానికి వెళ్లి కానిస్టేబుల్ జగదీష్ సతీమణి భార్గవికి అంత్యక్రియల ఖర్చులకుగాను రూ.25 వేలు అందజేశారు. విధి నిర్వహణలో చురుగ్గా పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన జగదీష్ చిన్నవయసులోనే బ్రెయిన్ క్యాన్సర్‌తో మృతిచెందడం తమకెంతో బాధకలిగించిందని వారు తెలిపారు.

గుర్రాలపై ఎన్‌సీసీ క్యాడెట్ల సాహస యాత్ర

- **వారంలో 200 కిలోమీటర్ల ప్రయాణం**



గుర్రాలపై సాహస యాత్రను ప్రారంభిస్తున్న క్యాడెట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 25: తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో గుర్రాలపై సాహస యాత్ర కార్యక్రమం ప్రారంభమైంది. ఎన్‌సీసీ నగర్‌లో ఈ కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆరు గుర్రాలు, 30 మంది క్యాడెట్లు, 10 మంది సహాయకులతో ఏడు రోజుల్లో 200 కిలోమీటర్ల మేర ఈ యాత్ర సాగనుంది. తిరుపతి నుంచి ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీ పురం, పాలమంగళం, పుత్తూరు మీదుగా సాగుతుంది. ఈ యాత్రలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లకు సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నారు. ఇందులో భాగంగా మొక్కల పెంపకం, పశువైద్య శిబిరం, రక్తదానం, క్రీడా నైపుణ్యాలు పెంచడం వంటి కార్యక్రమాలు చేపడతారు. ఈ యాత్రను ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌సీసీ అధికారి వీఎం రెడ్డి ప్రారంభించారు. తిరుపతి గ్రూప్ కమాండర్ యోగేష్ దుంగరకోటి, అధికారులు పాల్గొన్నారు.

అభినయ్‌రెడ్డి అప్డేట్ కావడం లేదు : జనసేన



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ రాయల్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 25: వైసీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి అభినయ్‌రెడ్డి అప్డేట్ కావడం లేదని, తిరుపతి నగర ప్రజలు అప్డేట్ అయ్యారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ విమర్శించారు. కొత్త వర్షన్‌తో అప్డేట్ అయిన ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో కొందరు కార్పొరేషన్ అధికారులు, నాయకులు బలిజ కులస్థులైన మహిళల ఆధార్‌కార్డులు తీసుకోవడం దేనికి సంకేతమమని ప్రశ్నించారు. ఆధార్‌కార్డులు తీసుకుని వారిని ఆత్మీయ సమావేశానికి పిలిచి బెదిరిస్తున్నారనే అనుమానం కలుగుతోందన్నారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం వస్తుందని, వచ్చిన వెంటనే తిరుపతిలో భూకబ్జాలకు, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. మంత్రి రోజా అడ్డంగా దోచేసిన సొమ్ముతో దిక్కుతెలియక ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆమెకు ఇక్కడ సీటు లేదని తెలిసి, తమిళనాడులో పోటీ చేసే యోచనలో ఉందని తెలిపారు. నగర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ తీసుకున్న నిర్ణయానికి జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు కట్టుబడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాబ్జి, హేమకుమార్, రాజమోహన్, రాజేష్ ఆచారి, రమేష్‌నాయుడు, కిషోర్, హిమవంత్ పాల్గొన్నారు.

వైసీపీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్, నెలవల

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 25: వైసీపీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసింహయాదవ్ మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మొదటి జాబితాలో ఇద్దరు ఎస్సీ అభ్యర్థులను టికెట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. టీడీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం ఉంటుందని, గత ఐదేళ్లలో పార్టీ జెండాను మోసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఓ మంత్రి ఖనిజ సంపదను ఎలా దోచుకున్నారో ప్రజలందరూ చూస్తున్నారని, ఈ దోపిడీని అరికట్టాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. తిరుపతిలో ఈనెల 27వ తేదీ మంగళవారం జరగబోవు జయహో బీసీ సదస్సులో బీసీ సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నారా లోకేశ్ యువతకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో తన కుమార్తె విజయశ్రీకి టికెట్టు కేటాయించడం జరిగిందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి టీడీపీని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంచి కృష్ణయ్య, శోభన్ నాయుడు, దార్ల రాజేంద్ర, ప్రసాద నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు: పాశిం



టీడీపీలో చేరిన వారితో సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 25: వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీలోకి చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు. చార్జీలు, పన్నులు, ధరలు విపరీతంగా పెంచేసిందన్నారు. రాష్ట్రాభివృద్ధిని మరచి దోచుకోవడమే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వం అవినీతిని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, దాడులు చేయడమేకాక తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, యువతకు, రైతులకు, బీసీలకు, అన్ని వర్గాల ప్రజలు పలు సంక్షేమ పథకాలు అందించేలా చంద్రబాబునాయుడు మినీ మెనిఫెస్టోను విడుదల చేశారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివకుమార్, మట్టం శ్రావణి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని కొమ్మనేటూరులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పాశిం సునీల్‌కుమార్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

60 మంది శివభక్తులచే ఆలయ శుద్ధి



నాగలాపురం, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయాన్ని ఆదివారం 60 మంది శివభక్తులు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చెన్నై అడయార్‌లోని తాందుండేశ్వర తిరుక్కోయిల్ సంఘం వారు సుమారు 60 మంది శివ భక్తులు ఆలయంలోని స్వామి, అమ్మవారి సన్నిధిలు, మూల స్థాన మూర్తులను, పరివార దేవతా మూర్తుల ఆధార పీఠాలను, ప్రదోష మండపాన్ని, పల్లికొండేశ్వర స్వామి సన్నిధిని, ఆలయం వెలుపల, బయట అన్నీ ప్రాంతాలను శుద్ధి చేశారు. ప్రతి సంవత్సరం శివరాత్రికి ముందు ఈ శివ భక్తులచే ఆలయ శుద్ధి చేయడం ఆనవాయితీ. ఇదే తరహాలో ఈ ఏడాది కూడా ఆలయ శుద్ధి చేశారు. ఈ శివ భక్తులకు ఆలయ అధికారులు ఆలయంలో ప్రత్యే దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మామా అల్లుడి గొడవ.. మూడో వ్యక్తికి గాయాలు



గాయపడిన భాస్కర్

కేవీబీపురం, ఫిబ్రవరి25: మామా అల్లుళ్ల గొడవ సందర్భంగా వారిని వారించేందుకు వెళ్లిన వ్యక్తిపై అల్లుడు దాడిచేశాడు. దీంతో అతడు గాయపడ్డాడు. మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన దాము కుమార్తె మునిరాజమ్మ. ఈమెను ఎస్ఎల్‌పురంలో గ్రామంలో ఉన్న తన చెల్లెలు కుమారుడైన వెంకటేష్‌కు ఇచ్చి పెళ్లిచేశాడు. ఈ క్రమంలో వెంకటేష్ దంపతుల మధ్య గొడవ జరగడంతో ఆమె పుట్టింటికి వచ్చింది. ఈ నేపథ్యంలో వెంకటేష్ అత్తగారింటికి వచ్చిడు. పొలం వద్ద ఉన్న మామపై దాడికి దిగాడు. పక్కనే ఉన్న భాస్కర్ వారిని విడదీయబోయాడు. దీంతో వెంకటేష్ అతడిపై కర్రతో దాడిచేశాడు. రక్తగాయాలయ్యాయి. శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు.

వాలీబాల్ విజేత రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్టు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ నగేషం

రేణిగుంట, ఫిబ్రవరి25: వాలీబాల్ పోటీల విజేతగా ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్టు నిలిచింది. స్థానిక రైల్వే క్రీడామైదానంలో ఆదివారం చిత్తూరు నెహ్రూ యువకేంద్రం, ఆషా స్వచ్ఛందసేవా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలను రేణిగుంట సర్పంచ్ నగేషం ప్రారంభించారు. పోటీలు హోరాహోరీగా జరిగాయి. చివరిగా మధుఫెండ్స్ జట్టుపై రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేతకు మండల కో-ఆప్షన్ సభ్యులు అసన్ సాహెబ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూలియస్‌రాజు, భాస్కర్‌బాబు, మధు, రాజేంద్ర, రవి పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకులో పడి బాలుడి మృతి

గూడూరు, ఫిబ్రవరి 25: మండలంలోని మిటాత్మకూరు గ్రామంలో ఆదివారం ఓ బాలుడు ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... మిటాత్మకూరు గ్రామానికి చెందిన పరుశురామ్(8) 3వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం స్థానిక సచివాలయ సమీపంలో ఆడుకుంటూ నిర్మాణంలో ఉన్న సెప్టిక్‌ట్యాంక్‌లో పడి మృతిచెందాడు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

బీరు బాటిళ్ల స్వాధీనం: ఒకరి అరెస్టు

గూడూరు, ఫిబ్రవరి 25: అక్రమంగా తరలిస్తున్న 48టిన్ బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రైల్వేజీఆర్ పోలీసులు తెలిపారు. రైల్వేజీఆర్‌పీ ఎస్ఐ కొండప్పనాయుడు కథనం మేరకు.... శనివారం అర్ధరాత్రి బెంగళూరు నుంచి కాకినాడ వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు జిల్లా టీపీ గూడూరు మండలం కోట్లపూడి గ్రామానికి చెందిన నాగేంద్రబాబు 48 టిన్ బీరు బాటిళ్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది వెంకటేశ్వర్లు, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు

తొట్టంబేడు, ఫిబ్రవరి 25: మండలంలోని సాంబయ్యపాళెం పంచాయతీకి చెందిన వెంకట్‌రెడ్డి ఆదివారం మాజీ జడ్పీటీసీ వెంకటాచలం ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, మునిరత్నం, కన్నలి ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోలా ఆనంద్‌ను గెలిపించండి

ఏర్పేడు, ఫిబ్రవరి 25: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఒక అవకాశం కల్పించాలని ఆ పార్టీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇసుకతాగేలి పంచాయతీ బీసీ కాలనీలో ఆదివారం ప్రచారం చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీరాయ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 25: పిచ్చాటూరు తహసీల్దార్ హసన్ సాహెబ్‌ని సింగిల్ విండో చైర్మన్ కె.టి.హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

వికృతమాల టిడ్కో ఇళ్లకు గ్రహణం







కాలనీలో రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు ● మరమ్మతులకు గురైన తాగునీటి పైప్‌లైన్ ● మురికి కాలువల దుస్థితి

- టీడీపీ పాలనలో వసతులు
- వైసీపీ వచ్చాక సవతిపేమ
- మౌలిక వసతుల మాటే లేదు
- ఇప్పటికీ ఖాళీగా ఉన్న ఇళ్లు

ఏర్పేడు, ఫిబ్రవరి 25: టీడీపీ హయాంలో పట్టణంలో అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారు. ఈ క్రమంలో ఏర్పేడు మండలం వికృతమాల వద్ద 1800 కుటుంబాలకు సరిపడే టిడ్కో ఇళ్లను నిర్మించారు. నీలాద్రి నిలయంగా నామకరణం చేశారు. తిరుపతిలో నివసిస్తున్న పేదలకు అందించారు. తర్వాత నాలుగు నెలల వ్యవధిలోనే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుండి ఆ కాలనీ వైపు అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.

టీడీపీ ప్రభుత్వం విశాలమైన సీసీరోడ్లు, ఆర్వో వాటర్ ప్లాంట్, పైప్‌లైన్‌ల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్ సౌకర్యం కల్పించింది. ప్రభుత్వం మారడంతో ఆనాటి నుంచి నేటి వరకు నీలాద్రి నిలయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఈ కాలనీలో నివసిస్తున్న పేదలు అనేక సమస్యలతో సతమతవుతున్నారు. ప్రధానంగా తాగునీటి సౌకర్యం లేదు. అప్పటి ప్రభుత్వంలో ఏర్పాటు చేసినతాగునీటి పైప్‌లైన్‌లు పాడయ్యాయి. ఫలితంగా వాటర్ క్యాన్‌లను కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. కాలనీలో ఉన్న 28 వీధులలో ఉన్న సుమారు 150 విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు లేవు. రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. రాత్రిళ్లు పాములు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. ఇటీవల మూడు నెలల క్రితం కాలనీలోని 29వ బ్లాక్‌లోని ఇంటిలో నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారిని పాము కాటేసింది. సకాలంలో వైద్యం అందడంతో అదృష్టవశాత్తూ పాప ప్రాణాలతో బయటపడింది. ఇక మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దోమలు వృద్ధి చెంది జనం విషజ్వరాల బారిన పడుతున్నారు. శ్మశాన వాటిక లేదు. ఫలితంగా కాలనీలో ఎవరైనా మృతి చెందితే తిరుపతిలోని గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి. ఇక సమీప పరిశ్రమల్లో పనిచేస్తే కొందరు కార్మికులు కాలనీలో మద్యం తాగి తూలుతుంటారు. బస్సు సౌకర్యం లేదు. రాత్రయితే ఆటోలు సైతం రావడం లేదు. నిత్యావసరాల కోసం జనం తిరుపతి, శ్రీకాళహస్తికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నీలాద్రి నిలయం పంచాయతీనా, మున్సిపాలిటీనా అనేది అధికారులు తేల్చలేదు. ఫలితంగా ఇక్కడి వారు పింఛన్లు, రేషన్ కోసం తిరుపతిలోని అద్దె ఇళ్లలోనే ఉండిపోవాల్సి వస్తోంది. ఇలా పలు సమస్యలతో చాలా కుటుంబాలు తిరుపతిలోనే ఉండిపోయాయి. కేవలం 300 కుటుంబాల వారు ఇక్కడే జీవిస్తున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని నీలాద్రి నిలయం వాసులు కోరుతున్నారు.

పాముల బెడద



కాలనీ మొత్తం పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అవి పాములకు ఆవాసంగా మారాయి. పలురికి ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. వీధి లైట్లు లేక రాత్రుల్లో కాలనీకి రాలేక పోతున్నాము. అధికారులు స్పందించాలి.

- రమణమ్మ

తాగునీరు కొంటున్నాం



తాగునీటి పైపులైన్లు పాడయ్యాయి. నాలుగేళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో క్యాన్ల ద్వారా తాగునీరు తెచ్చుకుంటున్నాం. అధికారులు, పాలకులు నీటిసమస్య పరిష్కరించాలి.

- కృష్ణవేణమ్మ

రుయాలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

వర్చువల్‌గా చేసిన పీఎం నరేంద్ర మోదీ





వర్చువల్లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ - శిలా ఫలకం ఆవిష్కరణలో అధికారులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 25 : ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద దేశంలోని పలు క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ)లకు గుజరాత్ రాజకోట్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల అనుబంధ రుయాస్పత్రి ఆవరణలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన శిలా ఫలకం ఆవిష్కరించారు. ఎస్వీ వైద్య కళాశాల భవన విజయం ఆడిటోరియంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం వీక్షించే ఏర్పాటు చేశారు. పీఎం మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కేర్ ప్రాజెక్ట్ కింద దేశంలోని ఐదు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్ కళాశాలలను జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. 200కు పైగా హెల్త్ క్రిటికల్ కేర్ బ్లాక్‌లను ప్రారంభించడం, శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగానికి పెద్దపీట వేశాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మద్దిల గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, టీబీ నియంత్రణాధికారి అరుణ సులోచన దేవి, డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధం

మొదటి అంతస్తులోని సరుకూ ఆహుతి ● పక్క భవనంపైకి చేరుకుని ప్రాణాలు దక్కించుకున్న గృహస్తులు

రెండు గంటలపాటు కష్టపడి మంటలను అదుపుచేసిన ఫైర్ సిబ్బంది ● రూ.కోటి మేర నష్టం





దగ్ధమవుతున్న చెప్పుల దుకాణం - మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రేగిన మంటలతో నగరంలో రెండంతస్తుల చెప్పుల దుకాణం పూర్తిగా కాలిపోయింది. తిరుపతి జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతికి చెందిన బద్రీనాథ్ వీవీ మహల్ రోడ్డులో నోవా కలెక్షన్స్ పేరిట ఓ చెప్పుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో చెప్పుల దుకాణం, మొదటి అంతస్తులో గోడౌన్, రెండో అంతస్తులో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. మూడో అంతస్తులో చిన్న గది ఉంది. ఆదివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణం నుంచి పెద్దఎత్తున పొగలు వ్యాపించాయి. రెండో అంతస్తులోని యజమానులు కిందకు దిగి చూసేందుకు ప్రయత్నించగా దట్టంగా పొగలు వ్యాపించడంతో ప్రమాదాన్ని గ్రహించారు. తక్షణం కుటుంబ సభ్యులందరూ మిద్దెమీదకు చేరుకుని పక్క భవనాలపై నుంచి వెనుక ప్రాంతంలోని మరో భవనంపైకి చేరుకుని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈలోపు మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణంతోపాటు మొదటి అంతస్తులోని గోడౌన్‌లోని సరుకు కాలిపోయింది. రెండో అంతస్తులోకి పొగలు వ్యాపించి గృహోపకరణాలన్నీ నల్లగా మాడిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు తిరుపతి జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు అగ్నిమాపక శకటాలతో సుమారు రెండు గంటలకు పైగా పోరాడి మంటలను అదుపుచేశారు. మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా నిరోధించారు. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సాయం అందించారు. ఈ ప్రమాదం వల్ల కోటి రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపకాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి సన్మానం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: ఎన్జీవో సంస్థ అయిని ఈఈఎంటీ సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ మెరిట్ పరీక్షలో జిల్లాలో మొదటి స్థానం సాధించిన జిత్రేంద విష్ణును స్థానిక ముదిరాజ్ సంఘం కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు రమణయ్య, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు వద్దంటూ పోస్టుకార్డు ఉద్యమం



ఈవీఎం వద్దంటూ పోస్టుకార్డుపై సంతకం చేసి అందజేస్తున్న ఓటర్లు

కోట, ఫిబ్రవరి 25: కోరుతూ మండలంలోని చిట్టేడు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త షేక్ రఫీ ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ ముద్దు... అంటూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఆదివారం కోట పట్టణంలో బజారుసెంటర్, ఆర్టీసీ సెంటర్, క్రాస్‌రోడ్డులో ఓటర్లకు పోస్టుకార్డులు అందజేసి వారి మనోభావాలను లిఖితపూర్వకంగా తీసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ రఫీ మాట్లాడుతూ ఈవీఎంలపై ప్రజా వ్యతిరేకతను ఉత్తరాల ద్వారా రాష్ట్రపతి, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయడం జరుగుతుందన్నారు. అనంతరం బజారుసెంటర్‌లో ఈవీఎంలు వద్దు... బ్యాలెట్ ముద్దు... అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మట్టిగుంట సురేంద్రబాబు, ఎంబెటి వెంకటకృష్ణయ్య, చెన్నకేశవులు, శ్రీరామ్‌సురేష్, ఆటో యూనియన్ కార్యదర్శి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు సాంకేతికతపై అవగాహన



ఆక్వా రైతులకు అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ ఆంజనేయులు

వాకాడు, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని అశోక్‌పిల్లర్ సమీపంలో ఉన్న బాలాజీ ఆక్వాఫీడ్, కెమికల్స్‌లో ఫిడోర సీఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆక్వా రైతులకు సాంకేతికతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ సైంటిస్ట్ ఆంజనేయులు మాట్లాడుతూ అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలతో శాస్త్రబద్ధంగా సమపాళ్ల పోషక విలువలు ఇవ్వడం ద్వారా తక్కువ ఖర్చుతో ఆక్వా ఉత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతిలో సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో ఫిడోర టీమ్ హరనాథ్‌రెడ్డి, నాగరాజు, బాలాజీ ఆక్వాఫీడ్స్ అధినేత బాలాజీ రైతులు పసుపులేటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అదుపుతప్పి గోడను ఢీకొన్న బస్సు

పది మందికి స్వల్ప గాయాలు



వడమాలపేట, ఫిబ్రవరి 25: మండలంలోని ఎస్వీపురం రైల్వే బ్రిడ్జి వద్ద ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆదివారం తిరుపతి నుంచి అరక్కోణం వెళుతున్న ప్రైవేటు బస్సు మండలంలోని ఎస్వీపురం రైల్వే బ్రిడ్జి వద్ద అదుపు తప్పి గోడను ఢీకొంది. డ్రైవర్ అరుణకుమార్‌తో పాటు పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బ్రిడ్జి కింద రోడ్డు పూర్తిగా పాడైపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మీ భవిష్యత్తుకు చంద్రబాబుది బాధ్యత: భానుప్రకాష్



ఇంటింటి ప్రచారంలో గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 25: వైసీపీ అవినీతి, అరాచక పాలనతో కుదేలైన పేద, మధ్య తరగతి వర్గాల భవిష్యత్తుకు విజనరీ నాయకుడు, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బాధ్యత తీసుకుంటున్నారని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని మూడు, నాలుగవ వార్డుల్లో కౌన్సిలర్ కేశవాచారి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, మీతో మీ తెలుగుదేశం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీ వెన్నులో వణుకుపుడుతోందన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి ఆడపడుచు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో, ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతస్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ఆరు గ్యారెంటీలను ప్రకటించినట్లు చెప్పారు. నగరి నియోజకవర్గం ప్రజలు రెండుసార్లు వైసీపీకి ఓటు వేసిన పాపానికి ఒక్క కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. పన్నులు, విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలను జగన్ ప్రభుత్వం పీల్చి పిప్పిచేస్తే, అందుకు రెండింతలుగా నగరి నియోజకవర్గ ప్రజలను వైసీపీ పాలకులు దోచుకున్నారని మండిపడ్డారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని, ఐదేళ్లు సేవకుడిగా పనిచేస్తానని స్పష్టం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క కొత్త పరిశ్రమ రాకపోగా ఉన్న పరిశ్రమలను సైతం తమ ధనదాహానికి బలితీసుకుని యువత పొట్టకొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పీడ విరుగుడైతేనే రాష్ట్రంతో పాటు భవిష్యత్తు తరాలకు మెరుగైన జీవనం లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వార్డులో భానుప్రకాష్‌కు ఘనస్వాగతం లభించింది. అడుగడుగునా మంగళహారతులతో పాటు పూలవర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కేశవ, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, మాజీ వైస్ చైర్మన్ డీఎస్ గణేష్, నబీ, వార్డు నాయకులు మునిరాజా, భాస్కర్‌నాయుడు, కేశవ, ప్రసాద్, శేఖర్, చీరల మోహన్, మస్తాన్, కిరణ్, జీవ, జ్యోతి, ప్రసాద్, రాజ్‌కుమార్, వేలు తదితరులు పాల్గొన్నారు.



స్కేటింగ్ విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి రోజా

స్కేటింగ్ విద్యార్థులకు మంత్రి అభినందనలు

పుత్తూరు, ఫిబ్రవరి 25: రోడ్ స్కేటింగ్‌లో రికార్డులు నెలకొల్పిన ఏడుగురు విద్యార్థులను మంత్రి రోజా అభినందించారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన స్కేటింగ్ విద్యార్థులు ఈనెల 12వ తేదీన తాడిపత్రి నుంచి బయలుదేరి గుత్తి, గుంతకల్, ఉరవకొండ, అనంతపురం, లేపాక్షి, హిందూపురం, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, ధర్మవరం మీదుగా 750 కిలోమీటర్లు ప్రయాణించి 15వ తేదీన తాడిపత్రికి చేరుకున్నారు. రికార్డు సమయంలో గమ్యస్థానం చేరుకున్న వీరు వజ్ర నేషనల్ రికార్డు, నేషనల్ కాంటినెంటల్ రికార్డులను సాధించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నిర్మాణ నిబంధనలకు పాతర

- అధికార పార్టీ నేతల బరితెగింపు
- అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం
- రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి
- మామూళ్ల మత్తులో అధికారులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25 : శ్రీకాళహస్తిలో కొందరు అధికార పార్టీ నాయకులు, అధికారుల అండతో ఆకాశమే హద్దుగా అక్రమంగా భారీ భవంతులను నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.


బజారు వీధిలో ఏడు స్లాబులతో నిర్మిస్తున్న భవనం

నాలుగు స్లాబుల అనుమతితో

శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎదురుగా బజారు వీధిలో ఓ భారీ భవన నిర్మాణం జరుగుతోంది. సాధారణంగా నిర్మాణానికి ముందు మున్సిపాలిటీకి నగదు చెల్లించి ప్లాన్ అప్రూవల్ పొందాలి. స్థల విస్తీర్ణం ప్రాతిపదికన అనుమతి ఇస్తుంటారు. 3200 చదరపు అడుగుల కన్నా తక్కువ స్థలం విస్తీర్ణం ఉన్న వాటికి గరిష్ఠంగా నాలుగు అంతస్తులకు మాత్రమే అనుమతి ఇస్తారు. అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం ఉన్న స్థలాలకు అదనపు అంతస్తులకు అనుమతి లభిస్తుంది. ఇప్పటివరకు మాడ వీధుల్లో నాలుగు అంతస్తులకు మించి ఎవరికీ అనుమతి లభించలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్న ఓ నేతకు 24 అడుగుల వెడల్పు, 87 అడుగుల పొడవు ఉన్న స్థలం బజారు వీధిలో ఉంది. మొత్తం 2088 చదరపు అడుగులు విస్తీర్ణం ఉన్న స్థలంలో లాడ్జి నిర్మాణం కోసం అప్రూవల్‌కు దరఖాస్తు చేశారు. దక్షిణం వైపున రోడ్డు పక్కన కొంత స్థలం, మరో మూడు వైపులా కిటికీల కోసం మరి కొంత స్థలం వదిలిపెట్టి నిర్మించే నిబంధనలతో నాలుగు స్లాబులకు అనుమతి పొందారు. ఆ తర్వాత పురపాలక సంఘం అధికారులు సహాయంతో నిర్మాణ పనులు చేపట్టారు. అంతే ఇక శరవేగంతో ఏకంగా ఏడు స్లాబులు వేసేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి పరిశీలన చేయగా నాలుగు అంతస్తులకు మాత్రమే అప్రూవల్ లభించినట్లుగా పక్కా బ్లూ ప్రింట్ కూడా వెలుగు చూసింది. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవ్వరూ నోరు మెదపడం లేదు.

అనుమతి తిరస్కరించినా...

అనుమతి తిరస్కరించినా కూడా దర్జాగా భారీ కళ్యాణ మండపం నిర్మించిన ఘటన ఇది. ఇది కూడా శ్రీకాళహస్తి నడిబొడ్డున రైల్వే స్టేషన్‌కు అత్యంత సమీపంలోని నక్కల కాలువ పక్కనే తిరుపతి రహదారికి ఆనుకుని జరుగుతున్న ఉదంతం. నక్కల కాలువ సమీపంలో తిరుపతి రహదారికి ఆనుకుని కళ్యాణ మండపం నిర్మాణం కోసం అధికార పార్టీకి సన్నిహితులైన ఓ ఉద్యోగి ఏడాదిన్నర క్రితం అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తు ఉండడంతో దాన్ని తుడా అధికారులు తిరస్కరించారు. అయితే స్థానిక అధికారులను అర్థ బలంతో మేనేజ్ చేశారు. భారీ కళ్యాణ మండపం నిర్మించేశారు. ప్రస్తుతం అది తుది దశలో ఉంది. అనుమతి లేకుండా ఒక్క ఇటుక పేర్చినా సరే పురపాలక సంఘం అధికారులు అక్కడికి చేరుకుని గగ్గోలు పెడుతుంటారు. సామాన్యుల నిర్మాణాలైతే కూల గొట్టేందుకు కూడా సాహసిస్తారు. కానీ ఈ అక్రమ కట్టడాన్ని ఇప్పటివరకు ఎవ్వరూ ప్రశ్నించిన పాపాన పోలేదు.

అసలు దరఖాస్తే చేయకుండా...

శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీలో కీలక పదవిలో ఉన్న నేత సాగిస్తున్న అక్రమ నిర్మాణం ఇది. ఇంజనీరింగ్ కళాశాలకు ఎదురుగా పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్థలంలో జరుగుతున్న తంతు ఇది. ఈ స్థలం 22ఏ లో ఉన్నట్లుగా చాలా కాలంగా ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా సెటిల్మెంట్ స్థలాన్ని సాగులో నుంచి 5 శాతం ప్రభుత్వానికి చలానా చెల్లించి ల్యాండ్ కన్వర్షన్ చేసుకోవాలి. ఆ తర్వాత అప్రూవల్ పొందాలి. ఈ భూమిలో కనీసం కన్వర్షన్, అప్రూవల్ కోసం కనీస దరఖాస్తు కూడా లేకుండానే భారీ కళ్యాణ మండపం నిర్మించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక స్లాబ్ అనుమతితో...

ఒక స్లాబ్ అనుమతితో అధికార పార్టీతో స్నేహంగా ఉండే ఓ వ్యక్తి భారీ కళ్యాణ మండపం నిర్మించారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు హౌసింగ్ బోర్డు సమీపంలో పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని జరిగిన నిర్మాణం ఇది. ఇటీవల 6 నెలల క్రితం ఈ కళ్యాణ మండపాన్ని అధికార పార్టీ నేతలు అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ఇక్కడ కేవలం ఒక అంతస్తుకు మాత్రమే అప్రూవల్ లభించింది. అయితే మరో అదనపు అంతస్తును నిర్మించినట్లు తెలిసింది.

500 చదరపు అడుగుల నిబంధనకు తూచ్

ఇంటి నిర్మాణాల కోసం కనీసం 500 చదరపు అడుగులకు మించితేనే అప్రూవల్ లభిస్తుంది. ఈ నిబంధన పేరుకు మాత్రమే. చేతులు తడితే తక్కువ విస్తీర్ణం ఉన్నా అడిగిన వెంటనే అప్రూవల్ ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

తేరు వీధిలో...

తేరు వీధిలో కూడా నిబంధన అతిక్రమిస్తూ భారీ భవనం నిర్మిస్తున్నారు. ఓ సీరియల్ నిర్మాత ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయన ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తేరు వీధిలో నాలుగు స్లాపుల భవనానికి అనుమతి పొందారు. అధికార పార్టీ నేతలు, కొందరు అధికారులు పూర్తిగా సహకరించడంతో ఇటీవల ఐదవ స్లాబ్ నిర్మించారు.

దక్షిణ కైలాస నగర్‌లో అప్రూవల్ మాయ

శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న దక్షిణ కైలాస నగర్ కాలనీలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అప్రూవల్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు. కొయ్యలు విక్రయించే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇళ్లను కట్టి అమ్ముతుంటారు. ఇటీవల దక్షిణ కైలాస్ నగర్‌లోని అయ్యలనాడు చెరువు కట్టకు ఆనుకుని అప్రూవల్ లేకుండానే ఒక ఇంటిని పూర్తి చేశారు. మార్కెట్లో విక్రయించారు. అదే ప్రాంతంలో ఎందరో సామాన్యులు ఇల్లు కడుతుండగా అప్రూవల్ లేదంటూ పురపాలక సంఘం అధికారులు పలుమార్లు పనులను అడ్డుకున్నారు. రియల్ వ్యాపారి మాత్రం అప్రూవల్ లేకుండానే నిర్మాణం ఎలా పూర్తి చేశారో అధికారులకే తెలియాల్సి ఉంది. ఇదే రియల్ వ్యాపారి గతంలోనూ ఇలా అప్రూవల్ చేయకుండానే పలు ఇళ్లు నిర్మించి విక్రయించడం బహిరంగ రహస్యం.

ప్రశాంతంగా గ్రూప్-2

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: గ్రూప్ -2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. శ్రీకాళహస్తిలోని ఐదు కేంద్రాల్లో ఆదివారం గ్రూప్ టు పరీక్ష జరిగింది. ఇందులో భాగంగా 964 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేశారు. 716 మంది హాజరవగా 248 మంది గైర్హాజరయ్యారు.

చెన్నై నుంచి ముంబయికి సైకిల్ యాత్ర



దంపతులకు జ్ఞాపికలు అందజేస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: పోలియో, మానసిక ఆందోళనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చెన్నై నుంచి ముంబయికి సైకిల్ యాత్ర చేస్తున్న దంపతులు ఆదివారం శ్రీకాళహస్తికి వచ్చారు.. పట్టణంలోని రోటరీక్లబ్ వద్ద స్థానిక రోటరీ సభ్యులు సైకలిస్ట్ సతీష్, శంకరీలను స్వాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వీరిని ఘనంగా సన్మానించారు. క్లబ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడండి


మట్లాడుతున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: బొజ్జల సుధీర్‌రెడ్డి ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవ హరిస్తున్నారని ఏదైనా వాస్తవాలు తెలుసుకుని మాటాడాలని ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు సూచించారు. ఆదివారం ఆలయ సమావేశ మంది రంలో బోర్డు సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సూక్ష్మనంది, పాత గంటలు ఆలయ అలంకార మండపంలో భద్రపరిచామని మీడియా ముందు వాటిని ప్రదర్శించారు. ఎమ్మెల్యే వాటికి బంగారు కవచం చేయించారని తెలిపారు. తిరుమంజనం గోపురం వద్ద భక్తుల కోసమే మెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక శివం టు శివం రోడ్డుకు రూ.19.20కోట్లతో టెండర్ పిలిచి పనులు చేపడుతున్నామని చెప్పారు. దీనిపైన అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. నాలుగు మాడ వీధుల్లో లైటింగ్ పనులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేస్తున్నామన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సన్నిధి వీధిలో డబుల్ రోడ్డు వచ్చేలా నూతన రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. సన్నిధి వీధిలోకి తేరువీధి నుంచి వచ్చేలా కూడా రోడ్డు నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. వాహనం మండపానికి అడ్డుగా లేకుండా గాంధీ విగ్రహాన్ని పక్కకు జరిపి ఏర్పాటు చేస్తున్నామని తొలగించలేదని స్పష్టం చేశారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయాలి


మాట్లాడతున్న దశరథాచారి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: తిరుపతిలో మంగళవారం నిర్వ హించే 'జయహో బీసీ' కార్యక్ర మానికి పెద్ద ఎత్తున నాయ కులు, కార్యకర్తలు తరలిరా వాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాల యంలో బీసీ విభాగం సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొరైరాజ్ రెడ్డి, మునిరాజా యాదవ్, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు, వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల రవి, గాండ్ల తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు, బీసీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు పేట బాలాజీ రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, తిరుపతి పార్లమెంటు నాయకులు గోవిందు, బీమాల భాస్కర్ ముదిరాజ్, మణి ముదిరాజ్, ముని సుబ్బారెడి పాల్గొన్నారు.

నేడు మహానంది ప్రారంభోత్సవం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 25: వరదయ్యపాళెం మండలంలోని జ్ఞానప్రసూనాంబ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయం ఎదుట నూతనంగా నిర్మించిన మహా నందిని సోమవారం ప్రారంభించనున్నట్లు ఆలయ ధర్మ కర్తల బొప్పన మోహన మురళి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి దర్శనం చేసుకోవాలి కోరారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: వచ్చే నెల మార్చి 10వ తేదీన జరగబోయే బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ జాతీయ యూనియన్ ద్వితీయ మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ మేరకు పట్టణంలోలి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం యూనియన్ సభ్యులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అప్రైజర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ... మహాసభ విజయవంతానికి అందరూ ఐకమత్యంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని బ్యాంకులకు సంబంధించి అప్రైజర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు భరోసా కల్పించండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారని వారికి, స్థానికుల భద్రతకు భరోసా కల్పించాలని ఎంజీఎం గ్రూప్ ఛైర్మన్ మల్లికార్జున్ నాయుడు స్థానిక డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డిని కోరారు. శ్రీకాళహస్తికి నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ ప్రజలందరికీ సహకరిస్తానని ఈ సందర్భంగా డీఎస్పీ తెలిపారు.

ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలని ముదిరాజ్ సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు నాగలక్ష్మి, యువత మహిళా అధ్యక్షురాలు అమరావతి సంయుక్తంగా ఆకాంక్షించారు. ఆదివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని సంఘం అధ్యక్షులు రమణయ్య ప్రకటించారు. ముదిరాజ్ సంఘ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నాగలక్ష్మి, యువత అధ్యక్షురాలిగా అమరావతి, పట్టణ అధ్యక్షురాలిగా సునీత, ప్రధాన కార్యదర్శిగా సుజాత, గౌరవ అధ్యక్షురాలిగా పద్మశ్రీ, ఉపాధ్యక్షురాలిగా శ్రీవిద్య, జాయింట్ సెక్రటరీలుగా అలేఖ్య, లత ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాజేశ్వరి, అరుణ, కార్యవర్గ సభ్యులుగా మునెమ్మ, లలిత, నాగమణి, సుబ్బమ్మ, శ్యామల, స్వాతి, సురేఖ, వరలక్ష్మి, సుమలత లను నియమించారు.

వైసీపీని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధం : జనసేన


జనసైనికులతో కలిసి ప్రచారం చేస్తున్న కోట వినుత

తొట్టంబేడు, ఫిబ్రవరి 25: వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమానుపురం పంచాయతీలలోని ఎగువవీధిలో 'జనసేన విజయయాత్ర.. ఏపీ నీడ్స్ పవన్' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిం చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ-జనసేన పొత్తుతో వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతు న్నాయన్నారు. వచ్చే ఉమ్మడి ప్రభుత్వమేనని ప్రజలకు సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలన అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు కావలి శివకుమార్, నాయకులు దాము, వెంకటేష్, గణేష్, చంద్రశేఖర్, రాజ్యలక్ష్మి, శారద, జ్యోతి, రాజేష్ జనసైనికులు పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన కొట్టే సాయి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టేసాయి ఆదివారం కలిశారు. స్థానికంగా పార్టీ విషయాలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూటమిలో భాగంగా ఉమ్మడి అభ్యర్థిగా ఎవరికి టికెట్ కేటాయించినా జనసైనికులు అందరూ కలసి పనిచేసి భారీ మెజారిటీ తీసుకురావాలని పవన్‌కల్యాణ్ సూచించారని చెప్పారు.

నిత్యాన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: శ్రీకాళహస్తీశ్వర ఆలయ అన్నదానానికి నెల్లూరుకు చెందిన కొండారెడ్డి, ఇందిరమ్మ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి రూ.50 వేలను అందజేశారు. ఆదివారం ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేశారు. పాలక మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం



సత్యవేడు, ఫిబ్రవరి 25: సత్యవేడులో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రూపేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా ఆలయం సమీపంలో నియోజకవర్గ ఇన్‌చార్జి లావణ్యకుమార్, జిల్లాకార్యదర్శి దాసు హేమకుమార్, చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్యకుమార్ మాట్లాడుతూ సత్యవేడులో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని పవన్‌కల్యాణ్, చంద్రబాబులకు బహుమతిగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్యోతీశ్వర్, హేమంత్, చెంచయ్య, ప్రసన్న, విజయకుమార్, సాయిలోకేష్, ముని, కుమార్, ధనుష్, పవన్‌కల్యాణ్, సతీష్, అనిల్, జ్యోతి పాల్గొన్నారు.

అభివృద్ధిని గెలిపించండి

తొట్టంబేడు, ఫిబ్రవరి 25: టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేయాలని ఆ పార్టీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి కోరారు. మండలంలోని కాసరం పంచాయతీలోని రాంబట్లపల్లి, కొండ్రాజుపల్లి, గొట్టిపూడి గ్రామాలలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు, మునిరాజనాయుడు, వెంకటాచలం, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, నాయకులు మునిరత్నం, భాస్కర్ నాయుడు, శంకరయ్య, లక్ష్మీనారాయణ, మస్తానయ్య, హరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పొరపాట్లు జరగరాదు


విమానాశ్రయంలో అధికారులతో సమీక్షిస్తున్న జేసీ, ఎస్పీ

రేణిగుంట, ఫిబ్రవరి25: ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరబాట్లకు తావుండరాదని జేసీ శుభంబన్సల్, ఎస్పీ మలికాగర్గ్ అధికారులను ఆదేశించారు. సీఎం జగన్ సోమవారం మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనకు రానున్నారు. ఇందుకోసం సోమవారం ఉదయం 9.35 గంటలకు సీఎం విమానాశ్రయం చేరుకుంటారు. 9.45 గంటలకు చిత్తూరు జిల్లాలో పర్యటనకు వెళతారు. సీఎం తన పర్యటన ముగించుకొని తిరిగి మూడు గంటలకు విమానాశ్రయం చేరుకుంటారు. 3.10 గంటలకు విమానాశ్రయం నుంచి గన్నవరం బయలుదేరి వెళతారు. ఈ క్రమంలో విమానాశ్రయంలో ఆదివారం ముందస్తు భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విమానాశ్రయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఎస్పీ పాటిల్‌దేవరాజ్ మనీష్, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసరావు, అధికారులు శ్రీహరి, రవిప్రభు, రమణయ్య, విమానాశ్రయం అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రశాంత పాలన అందిస్తా: సుధీర్



మట్లాడుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: శ్రీకాళహస్తి ప్రజలకు ప్రశాంత పాలన అందిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్ ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో 'ప్రొఫెషనల్స్ మీట్ విత్ ద లీడర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన శ్రీకాళహస్తిని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అక్రమాలకు అడ్డాగా మార్చేశారని విమర్శించారు. పేదలు సెంటు స్థలం కాపాడుకోవాలంటే భయం భయంగా రోజులు గడుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని తమ ఆదాయానికి ప్రధాన కేంద్రంగా తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీయిజాన్ని పెంచిపోషించి అమాయకులపై అక్రమ కేసులు పెట్టించి జైలు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఎంతో మంది టీడీపీ నాయకులు అక్రమ కేసులతో అరెస్టయి జైలు పాలయ్యారన్నారు. పట్టణంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా అమలు చేసి తీరుతామని తెలిపారు, ఈ సందర్భంగా పలువురు ప్రొఫెషనల్స్ అడిగిన ప్రశ్నలకు సుధీర్ రెడ్డి సమాధానం చెప్పారు. తెలుగు ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు తేజస్విని మాట్లాడుతూ మంచి కుటుంబం నుంచి వచ్చిన బొజ్జలను ఆశీర్వదించి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ నాయకులు సుమంత్, నియోజకవర్గం అధ్యక్షులు మోహన్‌లాల్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, పార్లమెంట్ కోశాధికారి కంఠారమేష్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాణమే లిబరేషన్ కాంగ్రెస్ లక్ష్యం


ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాట్లాడుతున్న విజయకుమార్

సత్యవేడు, ఫిబ్రవరి 25: పేదరికంలేని సమ సమాజ నిర్మాణమే లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ వ్యవస్థాపకుడు విశ్రాంత ఐఏఎస్ విజయకుమార్ పేర్కొన్నారు. విజయకుమార్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఐక్యత పథం యాత్ర ఆదివారం సత్యవేడుకి చేరింది. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జెండాను ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో భూస్వామ్య, బూర్జువా పార్టీలు పేదలను బానిసలుగా మారుస్తున్నాయని విమర్శించారు. తమ పార్టీలో పేద ప్రజలదే భాగస్వామ్యం అన్నారు. అంతకుముందు సాయిబాబా ఆలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి, రాజా, ఎత్తిరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దోపు ఉత్సవం


దోపు ఉత్సవంలో స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తొండమాన్ చక్రవర్తుల దోపు ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. పురాతన కాలంలో ఆలయంలో చోరీ జరగడంతో తొండమాన్ చక్రవర్తి నేరుగా వచ్చి దొంగతనం చేసిన వ్యక్తులు గుర్తించి వారి నుంచి దొంగిలించిన నగలను తిరిగి ఆలయానికి అప్పగించడం జరుగుతుంది. దీనికి ప్రతిగా ఆలయంలో ప్రతి ఏటా మాఘమాస పౌర్ణమి తర్వాత దొంగదోపు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అలంకార మండపంలో అలకరించిన తర్వాత ప్రత్యేక పూజల అనంతరం నాలుగు వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.